ప్రజాశక్తి
మంగళవారం 18 ఫిబ్రవరి 2025 5 అనంతపురం





ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అర్జీలకు త్వరితగతిన పరిష్కారం

వాట్సప్ గవర్నెన్స్‌పై దృష్టి సారించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ సమస్యలపై ప్రజలు అందించే అర్జీలకు సత్వర పరిష్కారం చూపేలా సంబంధిత అధికారులు కృషి చేయాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ తెలియజేశారు. రాయదుర్గం పట్టణంలోని సీతారామాంజనేయ కళ్యాణ మండపంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ ఇతర జిల్లా అధికారులు పాల్గొని రాయదుర్గం నియోజకవర్గానికి సంబంధించి ప్రజల నుంచి 360 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం అర్జీలకు పరిష్కారం 70 నుంచి 80 శాతం ఉందని, దానిని మరింత పెంచేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఈవారం నుంచి జిల్లా అధికారులు వారి పరిధిలో ఒక అర్జీని వ్యక్తిగతంగా పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ వాట్సప్ గవర్నెన్స్ మొదలు పెట్టారన్నారు. ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో వాట్సప్ గవర్నెన్స్ ద్వారా వస్తున్న సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తిప్పే నాయక్, ఆనంద్, మల్లికార్జున, డిఆర్ఓ మలోల, వ్యవసాయ శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ ఉమామహేశ్వరమ్మ, కళ్యాణదుర్గం ఆర్డీవో వసంత బాబు, జెడ్పీ సీఈవో ఆర్.రామచంద్ర రెడ్డి, సిపిఒ అశోక్ కుమార్‌తో పాటు అన్ని శాఖల జిల్లా, నియోజకవర్గంలోని అధికారులు పాల్గొన్నారు.

బాలారిష్టాల నడుమనే కేంద్రీయ విశ్వవిద్యాలయం

- ఇప్పటికీ పూర్తవని మౌలిక సదుపాయల కల్పన
- రెండేళ్లుగా నిధుల కేటాయింపుల్లేవ్..!
- భద్రతపై విద్యార్థినుల్లో ఆందోళన
- ఫీజుల భారమూ అధికమే



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటై ఇప్పటికి ఏడేళ్లు గడుస్తున్నా అది బాలరిష్టాలను దాటలేదు. యూనివర్సిటీలో ఇప్పటికీ పూర్తి స్థాయి మౌళిక సదుపాయల కల్పన జరగలేదు. ఇంతకాలం తాత్కాలిక భవనాల్లోనే నడుస్తూ వచ్చిన విశ్వవిద్యాలయం ఈ ఏడాది ఆగస్టులో శాశ్వత క్యాంపస్ ఉన్న జంతలూరుకు మార్చారు. ఇక్కడ ప్రారంభమైనప్పటికీ మౌలిక సదుపాయల కల్పన ఇంకా పూర్తవలేదు. ఒకవైపు పనులు నడుస్తుండగానే... మరోవైపు విద్యార్థులను అందులో చేర్చారు. ఈ పనుల నడుమ విద్యార్థినుల భద్రతపై ఆందోళన నెలకొంది. తరచూ బయటి వ్యక్తులు వసతి గృహంలోకి వచ్చేస్తుండటంతో విద్యార్థినులు భయపడిపోతున్నారు. రక్షణ కల్పించాలని ఆందోళనలు చేపడుతున్నారు. తాజాగా ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు విద్యార్థులనులు ఉన్న గదుల్లోకి తొంగిచూశారంటూ యూనివర్సిటీలో ఆందోళన కొనసాగింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకు విద్యార్థినులు ఆందోళనలు కొనసాగించారు. ఇదే రకమైన ఇబ్బందితో గతేడాది డిసెంబర్ 8వ తేదీన కూడా విద్యార్థినులు ఆందోళనలు చేశారు.



తమకు రక్షణ కల్పించాలని కోరుతూ యూనివర్సిటీ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

రెండేళ్లుగా పైసా నిధుల్లేవ్..!

కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో నిధుల కేటాయింపులు జరపకపోవడంతోనే సెంట్రల్ యూనివర్సిటీ నిర్మాణపు పనులు నత్తనడకన సాగుతున్నాయి. రెండేళ్ల క్రితం కేటాయించిన రూ.125 కోట్లతోనే ఇప్పటికీ నెట్టుకొస్తున్నారు. గత బడ్జెట్‌లోగానీ, ఈ బడ్జెట్‌లోగానీ యూనివర్సిటీకి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. ఒక అడకమిక్ బ్లాక్‌తోపాటు, రెండు వసతి గృహ భవనల నిర్మాణాలు మాత్రమే జరిగాయి. ఇందులో ఒకటి బాలురకుకాగా, మరొకటి బాలికలకు ఉంది. మొత్తం విశ్వవిద్యాలయంలో 900 మందికిపైగా విద్యార్థులుండగా 350 మంది బాలికలున్నారు ఈ బాలికల వసతి గృహం నిర్మాణం పనులు పూర్తవకనే ప్రారంభించారు. దీంతో పనిచేసేందుకు వచ్చిన వారు బాలికల వసతి గృహంలోకి ప్రవేశిస్తున్నారు. ఈ సమయంలో బాత్‌రూమ్‌ల్లోకి తొంగి చూస్తున్నారని విద్యార్థినులు ఆందోళన చెందుతున్నారు. తమకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు. గతంలోనూ పలుమార్లు విశ్వవిద్యాలయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. వారి రక్షణ కోసం ఏర్పాటు చేసిన సిసి కెమోరాలు సక్రమంగా పనిచేయడం లేదు. విద్యుత్ సౌకర్యం లేకపోతే ఆవి పనిచేయడం లేదు.



ఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ, ఐద్వా నాయకులు

విద్యార్థులకు రక్షణ కల్పించాలి

ఎస్పీకి ఐద్వా, ఎస్ఎఫ్ఐ విజ్ఞప్తి

కేంద్రీయ విశ్వవిద్యాలయంలో విద్యార్థినులకు పూర్తి స్థాయి రక్షణ కల్పించాలని జిల్లా ఎస్పీ జగదీశ్‌ను ఎస్ఎఫ్ఐ, ఐద్వా నాయకులు సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ విద్యార్థినులున్న వసతి గృహానికి సరైన రక్షణ లేకపోవడంతో బయటి వ్యక్తులు లోపలికి వస్తున్నారని తెలిపారు. అక్కడ ఏర్పాటు చేసిన సిసి కెమెరాలు కూడా విద్యుత్ లేని సమయంలో పనిచేయడం లేదని చెప్పారు. 16న వర్శిటీలో జరిగిన ఘటనపై సమగ్రమైన విచారణ జరిపించాలన్నారు. యూనివర్సిటీ హాస్టల్ భవనాల వద్ద తొంగి చూస్తున్న వ్యక్తులపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. యూనివర్సిటీ మొత్తం సీసీ కెమెరాలు మొత్తం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు చంద్రిక, అశ్విని, ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు భీమేష్, పట్టణ కార్యదర్శి శివ, పట్టణ ఉపాధ్యక్షులు సోము పాల్గొన్నారు.

ఫీజుల భారమూ అధికమే

కేంద్ర ప్రభుత్వం తగినంతగా నిధులు కేటాయించకపోవడంతో నిర్వహణకు అయ్యే ఖర్చును విశ్వవిద్యాలయం విద్యార్థుల నుంచే పిండుతోంది. అన్ని కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో ఏడాదికి ఫీజు రూ.1800 వరకుంటే ఇక్కడ మాత్రం రూ.10 వేల వరకు ఉంది. ఇంత భారాన్ని మోపడం సరైంది కాదని విద్యార్థులు కోరుతున్నా పాలకవర్గం పట్టించుకోవడంపైగా బాగా ఈ విషయంపై నిరసన తెలిపితే మీకు భవిష్యత్ లేకుండా చేస్తామని పరోక్ష హెచ్చరికలు చేస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



విద్యార్థినులతో సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ

యూనివర్సిటీలో ఎంపీ, ఎమ్మెల్యే తనిఖీ

విద్యార్థినుల ఆందోళనలతో అట్టుడుకుతున్న జంతులూరు సెంట్రల్ యూనివర్సిటీని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. యూనివర్సిటీలో మౌలిక సదుపాయాల కల్పనలో యూనివర్సిటీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైనది కాదంటూ ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతేడాది డిసెంబర్ 8న యూనివర్సిటీలో ఇలాంటి ఘటన చోటు చేసుకోగా రాష్ట్ర గవర్నర్, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు లేఖ రాశానని తెలిపారు. వైస్ ఛాన్సలర్ ఎస్.ఏ.కోరి నిర్లక్ష్యం, విధుల పట్ల బాధ్యతా రాహిత్యంగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకుంటామన్నారు. యూనివర్సిటీలో 24 గంటలూ పని చేసేలా సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. నాశిరకం భోజనం ఇస్తున్న ఏజెన్సీని కూడా మారుస్తామని విద్యార్థినులకు తెలియజేశారు.

సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు

బిఎస్ఎఫ్ జవానుకు పలువురి నివాళి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

దొంగను పట్టుకునే సమయంలో ప్రమాదవ వశాత్తు రైలు ఢీకొని బ్రహ్మసముద్రంకు చెందిన బిఎస్ఎఫ్ జవాను వడ్డే లక్ష్మన్న(33) మూడు రోజుల క్రితం ఢిల్లీ సమీపంలో మరణించారు. ఈయన పార్థవదేహాన్ని ఆదివారం రాత్రి సైనికాధికారులు బ్రహ్మ సముద్రం తీసుకొచ్చారు. మరణించిన జవాను భౌతికకాయాన్ని చూసి కుటుంబ సభ్యులు కన్నీటి పర్యవంతం అయ్యారు. సోమవారం ఉదయం జవాను అంత్యక్రియలను అధికారులు సైనిక లాంఛనాలతో నిర్వహించారు. జవాను ఇంటి నుంచి బ్రహ్మసముద్రం పశువైద్యశాల శ్మశానవాటిక వరకు ప్రత్యేక వాహనంలో అంతిమయాత్ర నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రుల అశ్రునయనాల మధ్య వీడ్కోలు పలికారు. అంతిమ సంస్కారాలు పూర్తయిన తర్వాత మిలటరీ హానర్స్ ప్రకారం జవాను పార్థివ దేహంపై కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు జాతీయ జెండా, పుష్పగుచ్ఛాలు ఉంచి అంతిమ నివాళులు అర్పించారు. సైనికులు గాల్లో కాల్పులు జరిపారు. కళ్యాణదుర్గం సైనిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అమర్నాథ్, జాయింట్ సెక్రటరీ నారాయణస్వామి, హెడ్ కానిస్టేబుల్ పిల్లలపల్లి నరసింహారెడ్డి, యూనిట్ హెడ్ క్వార్టర్ ఎస్ఐ బిఎన్.రావు, బోర్డ్ ఆఫ్ సెక్యూరిటీ ఫోర్స్ హెడ్ క్వార్టర్ బెంగుళూరు ఎలంక సమాన్ నిధి మెంబర్స్ 16 మందితో కలిసి జవాను పార్థివదేహాన్ని సైనిక, ప్రభుత్వ లాంఛనాలతో ఖననం చేశారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు సూచన మేరకు టీడీపీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు జవాను అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుమతి, ఎంపీడీవో నందకిషోర్, ఎస్ఐ నరేంద్ర కుమార్, జెడ్పీటీసీ ప్రభావతి, మాజీ ఎంపీపీ మంజుల వన్నురుస్వామి, క్లస్టర్ ఇన్‌ఛార్జి-1,2 అంకె ఓబులేసు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



అంత్యక్రియల సందర్భంగా గాల్లోకి కాల్పుల జరుపుతున్న పోలీసులు

మద్దతు ధరతో పంటలు కొనుగోలు చేయండి

కలెక్టరేట్ వద్ద రైతు, కౌలురైతు సంఘాల ఆందోళన



కలెక్టరేట్ వద్ద పంటలను పారబోసి నిరసన తెలుపుతున్న రైతులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం మద్దతు ధరను కల్పించి కొనుగోలు చేయాలని రైతు, కౌలు రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. మిరప, పత్తి, పప్పు శనగ, సీడ్ జొన్న రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, ప్రభుత్వమే కొనుగోలు చేసి, 2024-25 ఖరీఫ్, రబీ పంట నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం ప్రకటించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. రైతులతో కలిసి కలెక్టరేట్ ముందు పప్పుశనగ, జొన్న, మిరప విత్తనాలను పోసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు తరిమెల నాగరాజు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాలరంగయ్య మాట్లాడుతూ జిల్లాలో 2024-25 ఖరీఫ్, రబీలో సాగుచేసిన మిరప, పత్తి, సీడ్ జొన్న, పప్పుశనగ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలేక దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ప్రభుత్వం స్పందించి అన్ని పంటలకూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, గిట్టుబాటు ధరతో కొనుగోలు చేయాలన్నారు. రబీ సీజన్‌లో పప్పుశనగ సుమారు 57 వేల హెక్టార్లలో పంట సాగుచేయగా అతివృష్టి, అనావృష్టితో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. తెగుళ్లతో దిగుబడి లేక పెట్టుబడులు కూడా చేతికందని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి ఎకరాకు రూ.20 వేలు పంట నష్టపరిహారం ఇవ్వాలన్నారు. రైతుల వద్ద ఉన్న పంటను రూ.10 వేల మద్దతు ధరతో కొనుగోలు చేయాలన్నారు. సీడ్ జొన్నకు సంబంధించి విడపనకల్ మండలం హావళిగి గ్రామంలో సుమారు 2000 ఎకరాలకు పైగా పంట సాగు అయ్యిందన్నారు. ఈ పంటకు ప్రస్తుతం మార్కెట్లో మంచి ధర ఉన్నా వ్యాపారస్తులు కుమ్మక్కై నెల రోజుల ముందు క్వింటా రూ.4500 ఉండగా ఇప్పుడు ఉన్న ఫలంగా వెయ్యి రూపాయలకు తగ్గించారన్నారు. పంట పండినా దళారుల కుమ్మక్కుతో రైతులకు అన్యాయం జరుగుతోందన్నారు. ప్రభుత్వం స్పందించి రైతుల దగ్గర ఉన్న సీడ్ జొన్నను గిట్టుబాటు ధరకు అమ్ముకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇదే విధంగా పత్తి పంటను రూ.10వేలు, మిరపను క్వింటా రూ.50వేలతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. 2024-25కు సంబంధించి అన్ని పంటలకూ పంట నష్టపరిహారం ప్రకటించి రైతుల ఖాతాల్లో డబ్బులు వేయాలని కోరారు. అనంతరం అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.శివారెడ్డి రైతుసంఘం నాయకులు బిహెచ్.రాయుడు, రాజారాం రెడ్డి, మధుసూదన్, పోతులయ్య, వెంకటేష్, ఈరప్ప, నారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ అవినీతిపై డిఎంఎ కొరడా..!

ఆర్ఒ, ఆర్ఐ, అడ్మిన్ సెక్రటరీలకు ఛార్జిమెమోలు

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

అనంత కార్పొరేషన్‌పై వస్తున్న అవినీతి ఆరోపణల్లో వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ హరి నారాయణ గత నెల 19వ తేదీన ఆకస్మిక తనిఖీలు చేశారు. తనిఖీల్లో భాగంగా డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో డంపింగ్ యార్డ్‌లో చేపట్టిన బయో మైనింగ్‌లో భారీ ఎత్తున అవినీతి జరిగిందన్న అంశంపై పలు వివరాలు సేకరించారు. ఇదే సమయంలో భవనాల కొలతలు, భవన నిర్మాణాలు, ఆస్తి పన్ను విధింపులో జరిగిన అవినీతిని గుర్తించారు. అవినీతికి సంబంధించిన ఆయన గుర్తించిన అంశాల నేపథ్యంలో కొందరు అధికారులపై చర్యలు తీసుకునేందుకు సిద్ధం అయ్యారు. ఇందులో భాగంగా రెవెన్యూ ఆఫీసర్ విజయకుమార్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రఘునాథరెడ్డి, 54వ సచివాలయం వార్డ్ అడ్మిన్ సెక్రటరీ రాజేష్ రెడ్డిలు మూడంతస్తుల భవనాలు వాటి గ్రౌండ్ ఫ్లోర్‌లో వాణిజ్య దుకాణాలు నిర్వహిస్తున్న వాటికి గృహ సముదాయంగా రికార్డుల్లో పేర్కొనటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిక ద్వారా పంపారు. వాణిజ్య భవనాల కొలతల వివరాలను




ఈఆర్‌పి మాడ్యూల్లో అప్లోడ్ చేయకపోవడం చూస్తే పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని నిర్ధారించారు. కార్పొరేషన్ పరిధిలోని డోర్ నెంబర్లు వరుసగా 6-2-922-1 అసెస్మెంట్ నెంబర్ 1001047116, 6-2-923 అసెస్మెంట్ నెంబర్ 1001036713, 6-2-936 అసెస్మెంట్ నెంబర్ 10011036779, 6-2-937 అసెస్మెంట్ నెంబర్ 1001036784లో భూమిపై ఉన్న పరిస్థితికి ఆన్‌లైన్‌లో పేర్కొన్న కొలతలకు వ్యత్యాసం ఉన్నట్టు తనిఖీ సందర్భంగా గుర్తించారు. ఈ భవనాలకు పన్నులు సక్రమంగా వేయకుండా కార్పొరేషన్‌కు ఆర్థిక నష్టాన్ని చేకూర్చారనే భావనతో సంబంధిత అధికారులు ఛార్జీ మెమోలు జారీ చేశారు. ఈ ఛార్జీ మెమోలో అధికారులు చేసిన తప్పిదం, దాని వల్ల కార్పొరేషన్‌కు వాటిల్లిన నష్టం వివరాలు అన్నింటినీ పొందుపరిచారు. మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ స్వయంగా భవనాలను తనిఖీ చేసి రికార్డుల్లో ఉన్న దానికి భూమిపై వాస్తవికంగా ఉన్న భవనాల కొలతలతో పాటు ఆస్తి పన్ను విధింపులో భారీ అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించారు. వీటిన్నింటిపై 15 రోజుల్లోపు వివరణ ఇవ్వాలని రెవెన్యూ ఆఫీసర్ విజయకుమార్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రఘునాథ్ రెడ్డి, 54వ సచివాలయం వార్డ్ అడ్మిన్ సెక్రటరీ రాజేష్ రెడ్డిలకు ఇచ్చిన ఛార్జీ మెమోలో తెలిపారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం తక్కువ కొలతలతో ఆస్తి పన్ను వేయించుకున్న భవనాలు కార్పొరేషన్ అనుమతులకు లోబడి నిర్మించారా లేక అక్రమ కట్టడాల అన్న అంశాన్ని నిర్ధారించేందులా డిటిసిపి అడుగులు వేస్తోంది. వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న భవంతులకు కొళాయి కనెక్షన్లను వాణిజ్య అవసరాల ధరలతో ఇచ్చారా.. గృహ అవసరాల మేరకు ఇచ్చారా అన్న దానిపైనా విచారణ చేపట్టినట్లు సమాచారం. స్వయంగా మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ హరి నారాయణ నగరంలో భవనాల కొలతల తీయడం ద్వారా అన్ని విభాగాల్లో జరిగిన అవినీతి వెలుగు చూసే అవకావం ఉందనే చర్చ కార్పొరేషన్‌లో నడుస్తోంది.

రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నవీకరించాలి

జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ

ప్రజాశక్తి-రాయదుర్గం

పౌరసరఫరాల గోదాములో స్టాకు వివరాలకు సంబంధించిన రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఉండాలని జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ సూచించారు. సోమవారం పట్టణంలోని పౌర సరఫరాల గోదామును జెసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోదాములో నిత్యం సీసీ కెమెరాలు పని చేస్తూ ఉండాలన్నారు. గోదాములో ఎలాంటి సరుకూ వృథా చేయకూడదన్నారు. అలాగే సరుకు రవాణా చేసేటప్పుడు జరిగే వృథాను అరికట్టాలన్నారు. గోదాములో పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గోదాములో కొలతలు వేసే యంత్రాలు సక్రమంగా పని చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ వసంతబాబు, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రమేష్‌రెడ్డి, తహశీల్దార్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న జెసి

సిపేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ స్థల పరిశీలన

పట్టణంలోని సీపేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ కోసం ప్రతిపాదించిన సర్వే నెం.252లో విస్తీర్ణం 4.20 ఎకరాల భూమిని జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.



సర్వేయర్లతో మాట్లాడుతున్న తహశీల్దార్ రాజా

నోటీసులు ఇవ్వకుండా సర్వే చేయొద్దు

యల్లనూరు : రైతులకు నోటీసులు ఇవ్వకుండా సర్వే చేయొద్దని తహశీల్దార్ రాజా మండలంలోని సర్వేయర్లకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సర్వేయర్లతో మాట్లాడుతూ భూముల సర్వే కొలతలకు చలానా తప్పనిసరి అన్నారు. అంతేగాకుండా సర్వే చేసే క్రమంలో భూమి చుట్టూ ఉన్న రైతులకు నోటీసులు ఇవ్వాలన్నారు. వారందరికీ ఇష్టపూర్వకంగానే సర్వే చేయాలన్నారు. అలాగే చలానా గడువులోపు భూమి సర్వే కొలతలు పూర్తి చేయాలని ఆదేశించారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయుల జయంతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ జి.నరసింహన్ అధ్యక్షతన జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉపకులపతి బి.అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, చరిత్ర శాఖ హెచ్.తిప్పేస్వామి కలిసి రాయలు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విసి మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు అనేక రంగాల్లో నైపుణ్యం సాధించారన్నారు. ముఖ్యంగా యుద్ధరంగం, సంగీత, సాహిత్య రంగాల్లో విశేష ప్రావీణ్యాన్ని సాధించి విజయనగర సామ్రాజ్యాన్ని సంగీత సాహిత్య సంపదలకు వారసత్వంగా నిలిపిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. తాను తులు భాషకు చెందిన వాడైనప్పటికీ కర్ణాటక రాజైన తెలుగు భాష కోసం విశేషమైన కషి చేసిన వ్యక్తిగా మనకి కనిపిస్తారని తెలిపారు. జయంతి ఉత్సవ కార్యక్రమానికి కన్వీనర్‌గా సామాజిక శాస్త్ర విభాగం సహాయాచార్యులు డాక్టర్ చాగంటి రామిరెడ్డి వ్యవహరించారు. చిన్నారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల ఆచార్యులు, బోధనేతర ఉద్యోగులు, పరిశోధక విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణదేవరాయులు విగ్రహానికి పూలమాలల వేసి నివాళులర్పిస్తున్న శ్రీకృష్ణదేవరాయుల యూనివర్శిటీ సిబ్బంది

'ఉపాధి' పనులు కల్పించాలి : సిపిఎం



ఎంపిడిఒకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలో 50రోజులు అదనంగా ఉపాధి హామీ పనులు కల్పించాలని సిపిఎం నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ అలివేలమ్మ, ఎపిఒ నరేంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సూరి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో సమర్థంగా పనులు కల్పించాలన్నారు. అంతేగాకుండా పనికి తగ్గట్టు వేతనం ఇవ్వాలని, పని చేసే చోట నీరు, మజ్జిగ, నీడ, మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచాలని, వికలాంగులకు అనుకూలంగా పనులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి.పెద్దయ్య, రాజు, కుళ్లాయప్ప, జి.వెంకటచౌదరి, బి.భాస్కర్‌రెడ్డి, కె.నాగభూషణ్, రామానుజన్‌రెడ్డి, నాగలింగం పాల్గొన్నారు.

గుంతకల్లులో పాత్రికేయుడు అదృశ్యం

కుటుంబ సభ్యుల ఆందోళన

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

అనంతపురం జిల్లా గుంతకల్లు మండల పరిధిలో ఓ యూటూబ్ విలేకరి అదృశ్యమైన ఘటన తీవ్ర సంచలనం రేపింది. గుంతకల్లు మండల పరిధిలోని సంఘాల గ్రామ సమీపంలో విలేకరి ద్విచక్రవాహనం రోడ్డుపై పడి ఉంది. ఆ ద్విచక్రవాహనంపై ఓ పెద్ద బండరాయి పడి ఉండడం తీవ్ర అనుమానాలకు తావిస్తోంది. ఇందుకు సంబంధించి పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... కర్నూలు జిల్లా మద్దికేర గ్రామానికి చెందిన తిరుమలరెడ్డి కూతురు చదువు నిమిత్తం ఆరు సంవత్సరాల క్రితం గుంతకల్లుకు వచ్చి తిలక్ నగర్‌లో స్థిరపడ్డాడు. ఓ యూటూబ్ ఛానల్‌లో విలేకరిగా పని చేస్తున్నాడు. ఈయనకు బుగ్గ సంఘాల గ్రామం సమీపంలో 15 ఎకరాల భూమి ఉంది. ప్రతిరోజు ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు తోటలో పని చూసుకుంటూ మిగిలిన సమయంలో ఫైనాన్స్ వ్యాపారం, విలేకరి పనిని చూసుకునేవాడు. సోమవారం ఉదయం ఇతని ద్విచక్రవాహనం బుగ్గసంగాల గ్రామ సమీపంలోని హంద్రీనీవా కాలువ వద్ద పడి ఉంది. వాహనంపై పెద్ద బండరాయి కూడా ఉంది. దీనిని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే సిఐ ప్రవీణ్‌కుమార్, రూరల్ ఎస్ఐ వెంకటస్వామి ఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. అదృశ్యం అయిన పాత్రికేయుని భార్యను ఘటనా స్థలం వద్దకు పిలిపించి వివరాలు సేకరించారు. ఈసమయంలో ఆమె ఇటీవల వార్తలు ప్రసారం చేస్తున్నాడన్న కారణంతో ఓ నాయకుని కుటుంబ సభ్యులు తన భర్తను బెదిరించారని తెలిపింది. ఇతనికి ఎవరైనా హాని తలపెట్టారా.. లేక కిడ్నాప్ చేశారా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు ఆధ్వర్యంలో నిరసనలు



శింగనమలలో వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు, అంగన్వాడీలు

ప్రజాశక్తి-శింగనమల

అంగన్వాడీలు, హెల్పర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో అంగనవాడీ, మినీ అంగన్వాడీలు, హెల్పర్లు దాదాపు 42 రోజులు సమ్మె చేశారన్నారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న టిడిపి నాయకులు తాము అధికారంలోకి వస్తే అంగన్వాడీ, హెల్పర్లకు కనీస వేతనం ఇవ్వడంతోపాటు గ్రాట్యుటీ అమలు చేసి, మినీ అంగనవాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చాక ఆ ఊసే లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, హెల్పర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని, అంగన్వాడీలు, హెల్పర్లకు ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అలాగే సర్వీసులో ఉండి చనిపోయిన వారికి దహన సంస్కారాలకు రూ.20వేలు ఇవ్వడంతోపాటు కుటుంబంలోకి ఇచ్చి ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న 164 సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేయాలని, మెనూఛార్జీలు పెంచాలన్నారు. వీటితోపాటు అంగన్వాడీ సెంటర్లకు ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్‌లు కనీసం మూడు నెలలు ఇవ్వాలని, తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ గాయత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ ప్రధాన కార్యదర్శి, జిల్లా కోశాధికారి కాత్యాయని, అంగన్వాడీ ప్రాజెక్టు అధ్యక్షులు రమణమ్మ, ట్రెజరర్ ఎం.లీలావతి, టి.రత్నమ్మ, ప్రమీలమ్మ, భారతి, విమల, సుజాత, నాగేశ్వరమ్మ, అంగన్వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : అంగన్వాడీ ఉద్యోగులను మూడవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, సుప్రీంకోర్టు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని, గుజరాత్ హైకోర్టు తీర్పును దేశమంతటా అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం ఉరవకొండ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సూపర్‌వైజర్లకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు ధనలక్ష్మి, విజయ, సత్యవతి, కౌలు రైతుసంఘం నాయకులు రంగారెడ్డి, పెద్ద ముష్టూరు వెంకటేసులు, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు సోమవారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షురాలు శకుంతల, ప్రధాన కార్యదర్శి జ్యోతిలత, గౌరవాధ్యక్షురాలు గోవిందమ్మ, సెక్టార్ లీడర్లు రాజేశ్వరి, శంకరమ్మ, లలిత, సిఐటియు నాయకులు ఉమాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : అంగన్వాడీ వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు, సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహం నుంచి ఐసిడిఎస్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయం బయట బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రాఘవేంద్రకు అందజేశారు. వీరి ధర్నాకు సిపిఎం నాయకులు నాగరాజు, మధు, కృష్ణానాయక్, తదితరులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎన్.లోకేష్, రాయదుర్గం ఐసిడిఎస్ రాయదుర్గం శాఖ అంగన్వాడీ కార్యకర్తల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు గోవిందమ్మ, మేరీ, కోశాధికారి రాధమ్మ, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

గుత్తి : అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సాకే నాగరాజు డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సోమవారం ఎపి అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మల్లేష్, వి.నిర్మల, నాయకులు ఎస్‌కె.మహబూబ్‌బాషా, మురళి, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు రేష్మ, గంగా, కళ్యాణి, పార్వతి, లలితమ్మ, నాగమణి, శైలజ, పద్మజ, శకుంతల, తదితరులు పాల్గొన్నారు.



ఉరవకొండలో ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు, అంగన్వాడీలు

పండమేరు ఆలయానికి నిధులు మంజూరు చేయాలని వినతి



టిటిడి ఛైర్మన్‌తో ఆలయ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-రాప్తాడు

మండల కేంద్రంలోని పండమేరు వెంకటరమణ స్వామి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తిరుమల టిటిడి కార్యాలయంలో ఛైర్మన్ బిఆర్.నాయుడు, ఇఒ శ్యామలరావుకు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా తిరుమలకు దర్శనార్థం వచ్చిన హోంమంత్రి వంగలపూడి అనితను మర్యాదపూర్వకంగా కలిసి ప్రభుత్వం తరపున ఆలయ నిర్మాణానికి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చిట్టి రాముడు, కమిటీ సభ్యులు బట్టి నరసింహులు, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలు

పుట్లూరు : మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామంలో రైతు నారాయణమ్మ సాగు చేసిన పప్పుశనగ పంటలో ఎఇఒ హరి ఆధ్వర్యంలో సోమవారం పంటకోత ప్రయోగం చేసినట్లు ఎఒ కాత్యాయిని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీమా ఏజెంట్ షమీర్, రైతులు పాల్గొన్నారు.

ఎం.శ్రీనివాసులుకు డాక్టరేట్



అనంతపురం సిటీ : నార్పల మండలం కేసేపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత సహాయకులుగా పని చేస్తున్న ఎం.శ్రీనివాసులుకు అనంతపురం జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. శింగనమల మండలంలోని నాగులగుడ్డం తండాకు చెందిన లక్ష్మానాయక్, ఎం.రామిబాయి కుమారుడు శ్రీనివాసులు డాక్టర్ ఆర్ భువన విజయ పర్యవేక్షణలో గణితంలో 'ఎ స్టడీ ఆన్ వేరియస్ హైబ్రిడ్ నానోఫ్లూయిడ్ ఫ్లోస్ ఓవర్ ఎ ఫ్లాట్ ప్లేట్ విత్ థర్మల్ రేడియేషన్' అనే అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

పద్మశ్రీ ఆశావాది ప్రకాశరావుకు నివాళి

అనంతపురం : నగరంలోని పొట్టి శ్రీరాములు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవాసంస్థ ఆధ్వర్యంలో పద్మశ్రీ కళారత్న ఆశావాది ప్రకాశరావుకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు టివి రెడ్డి అధ్యక్షతన చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కెయు తెలుగు శాఖ అకడమిక్ కన్సల్టెంట్ నానీల నాగేంద్ర, ఏలూరి యంగన్న, ప్రకాశరావు తనయుడు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆశావాది శశాంక మౌళి, ఆశావాది తిరుపతయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, ఉపాధ్యాయులు తులసిరెడ్డి, మల్లికార్జున, తెలుగు వెలుగు సంస్థ నాయకులు కె.అల్తాఫ్, కె.సుబ్బరాయుడు, కెఎల్ఎన్.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రాయితీతో స్ప్రేయర్లు

రాయదుర్గం రూరల్ : ట్రాక్టర్ కలిసిన ఉద్యాన రైతులకు 50శాతం రాయితీతో మౌంటెడ్ స్ప్రేయర్లు అందజేయనున్నట్లు ఉద్యానశాఖ జిల్లా అధికారి నరసింహారావు, ఎపిఎంఐపి ప్రాజెక్టు డైరెక్టర్ రఘునాథరెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని ఉద్యానశాఖ కార్యాలయంలో మాట్లాడుతూ 2024- 25 సంవత్సరంలో ఉద్యాన శాఖ అమలు చేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా మామిడి పండ్ల ఉత్పత్తిలో నాణ్యమైన అధిక దిగుబడులను ఇచ్చే రక్షణ కవచం (ఫ్రూట్ కవర్) రాయితీతో పంపిణీ చేయనున్నట్లు రాయదుర్గం ఉద్యాన శాఖ అధికారిణి మౌనిక తెలిపారు.

కంటి అద్దాలు పంపిణీ

యాడికి : మండల పరిధిలోని కోన ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 11 మంది విద్యార్థులకు సోమవారం ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి డివిజన్ జిపిఎంఒఒ మధుసూదనరాజు, జిల్లా సివిల్ సర్జన్ డాక్టర్ సైదన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిన్నపెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

యల్లనూరు : జంగంపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న వెంకటాద్రిపల్లి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తహశీల్దార్ రాజాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో ఐదు రోజుల నుంచి నీరు సరఫరా కావడం లేదని వాపోయారు. ఈ విషయం పలుమార్లు పంచాయతీ కార్యదర్శికి విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. కావున వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

యల్లనూరు : యల్లనూరు మండల సబ్‌స్టేషన్‌లో 33/11 కెవి విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఎఇ రవీంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. మండల ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

బడి దగ్గర బెల్ట్‌షాపు నిర్వహణ దారుణం

కుందుర్పి : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, బిసి గురుకుల పాఠశాల సమీపంలో మద్యం అమ్మకాలు చేపట్టడం దారుణమని వైసిపి మండల కన్వీనర్ హనుమంతురాయుడు సోమవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి హయాంలో ఇంటింటికీ రేషన్ పంపిణీ చేస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామగ్రామానికీ బెల్టుషాపులు ఏర్పాటు చేసిందని ఎద్దేవా చేశారు. మండల వ్యాప్తంగా ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనంలో మద్యాన్ని సరఫరా చేయడం బాధాకరమన్నారు. ఆఖరికి గుడి, బడి ఉన్న ప్రదేశాల్లో కూడా మద్యాన్ని విక్రయిస్తుండటం బాధాకరమన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ చర్యలు తీసుకుని మండలంలో నిర్వహిస్తున్న బెల్ట్ షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బాలోత్సవంలో రేగడి కొత్తూరు విద్యార్థుల ప్రతిభ


బుక్కరాయసముద్రం : ఫిబ్రవరి 14, 15, 16 తేదీలలో అనంత బాలోత్సవం పిల్లల పండగ- 5 లలిత కళాపరిషత్‌లో కల్చరల్, గిల్డ్ ఆఫ్ సర్వీస్ అకాడమిక్ పోటీల్లో రేగడి కొత్తూరు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా జ్ఞాపిక ప్రశంసపత్రాలు, పతకాలు అందుకున్నారు. ప్రతిభ కనబరచడంపై రేగడి కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్‌వివి.రమణయ్య, ఉపాధ్యాయులు షమీవుల్లా, శ్రీలక్ష్మి, బాబ్జి నాయక్, పద్మావతి, సూరీడు, మీనా కుమారి, చాంద్‌బాషా అభినందించారు.



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

బడా వ్యాపారవేత్తల లబ్ధికే కేంద్ర బడ్జెట్

వామపక్షాల ఆధ్వర్యంలో నిరసనలు



గుత్తిలో ఆందోళన చేస్తున్న వామపక్షాల నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

అంబానీ, అదానీ లాంటి బడా పారిశ్రామికవేత్తలకు లబ్ధి చేకూర్చేందుకే ఇటీవల కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని వామపక్ష నాయకులు విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ సోమవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల, సిపిఐ మండల కార్యదర్శి జి.రామదాసు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. నిలదీయాల్సిన కేంద్రంలోని కూటమి ప్రభుత్వం మిన్నకుండిపోయిందన్నారు. అనంతరం తహశీల్దార్ డి.ఓబిలేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకుడు బి.రామకృష్ణ, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, ఐద్వా మండల కార్యదర్శి ఎన్.రేణుక, ఆర్ఎస్.కవిత, రేవతి, సిపిఐ నాయకులు రమేష్, మధుసూదన్‌రావు, వెంకటరాముడు, రాజుయాదవ్, షేక్ నజీర్, మహమ్మద్, మాబున్నీ, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద, మధ్యతరగతి, కార్మిక, కర్షకులకు వ్యతిరేకంగా ఉందన్నారు. ముఖ్యంగా కరువు జిల్లాకు పూర్తిస్థాయిలో అన్యాయం జరిగిందన్నారు. ఇప్పటికైనా కేంద్రం స్పందించి రాష్ట్రాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ అనిమిరెడ్డి, మండల కార్యదర్శి మల్లేష్, సిపిఐ మండల కార్యదర్శి నాగరాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులు రహీమ్, బాబాఫక్రుద్దీన్, శివకుమార్, శ్రీరాములు, శంకర్, ఈశ్వరయ్య, రాజ్యలక్ష్మి, శిరీషా, పెద్దక్క, భాను, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ సోమవారం మండల కేంద్రంలోని వామపక్షాల ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపి తహశీల్దార్ సాకే బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్, ఎర్రిస్వామి, మునెప్ప, ఆంజనేయులు, కుళ్లాయిస్వామి, కేశన్న, సూరి, అశోక్, ఆది కేశన్న. లక్ష్మీనారాయణ. ఆంజనేయులు. వెంకటేష్. తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఫార్మాసూటికల్ అనాలసిస్ విభాగాధిపతి పి.రామలింగం

ఔషధ పరిశోధన రంగంలో విస్తృత అవకాశాలు

ఫార్మాసూటికల్ అనాలసిస్ విభాగాధిపతి పి.రామలింగం

ప్రజాశక్తి-అనంతపురం

ఔషధ పరిశోధనా రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని హాజీపూర్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసిటికల్ ఎడ్యుకేషన్, రీసెర్చ్ విభాగాధిపతి పి.రామలింగం అన్నారు. సోమవారం అనంతపురమ జెఎన్‌టియు అనుబంధం తైల సాంకేతిక, ఔషధ పరిశోధనా సంస్థ సంచాలకులు జీవీ సుబ్బారెడ్డి అధ్యక్షతన 'ఔషధ రంగంలో పరిశోధనలకు ఉన్న విస్తృత ఉపాధి అవకాశాలు' అనే అంశపై ఉపన్యాసం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ అండర్ గ్రాడ్యుయేషన్ నుంచే పరిశోధన పట్ల శ్రద్ధ, ఆసక్తులు కనబరచాలన్నారు. వారికి ఇష్టమైన ఔషధరంగ అంశంపై అవగాహన ఏర్పరచుకొని, తద్వారా పరిశోధనా రంగంలో అభ్యున్నతిని సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సి.గోపీనాథ్, డిప్యూటీ రిజిస్ట్రార్ బి.దుర్గాప్రసాద్, ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ సిఎం మహేష్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఇంటర్వ్యూలు

పుట్లూరు : మండలంలో వివిధ కార్పొరేషన్ల కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంగళవారం, బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ అలివేలమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు ప్రతిఒక్కరూ తమ పత్రాలతో ఎంపిడిఒ కార్యాలయంలో హాజరుకావాలని కోరారు.

హుండీ లెక్కింపు

పెద్దపప్పూరు : మండల పరిధిలోని చిన్నపప్పూరు సమీపంలో వెలసిన అశ్వర్థ నారాయణస్వామి, భవాని భీమలింగేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. ఇందులో భాగంగా మాఘమాసం 3వవారం తాత్కాలిక హుండీ ద్వారా రూ.8,24,413, శాశ్వత హుండీ ద్వారా రూ.5,09,968, శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.2,36,000, తలనీలాల ద్వారా రూ.34,025 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇఒ సుబ్రమణ్యం తెలిపారు.

దళితుల భూములకు రక్షణ కల్పించాలి

వ్యకాసం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి



ధర్నా చేస్తున్న రైతుసంఘం, ఎంఆర్‌పిఎస్ నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

దళితుల భూములను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు లక్ష్మన్న డిమాండ్ చేశారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో సోమవారం కూడేరు మండలంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు బాధిత రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం అసిస్టెంట్ కలెక్టర్ వినూత్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1933లో కడదరకుంట గ్రామానికి చెందిన దళిత చకారి కొత్తి మారెప్పకు సర్వే నెంబర్ 27లో 10.99 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇచ్చారన్నారు. అయితే ఇదే భూమిని అదేగ్రామానికి చెందిన దుప్పటి సిద్ధప్పకు 1959లో చూపుడు ఆయికం కింద రూ.1400కు పెట్టారన్నారు. ఈనేపథ్యంలో సంబంధిత భూమిని దుప్పట రామాంజనేయులు, టీచర్ వెంకటేశులు అన్యాక్రాంతం చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఒకసారి దళితులకు ప్రభుత్వ భూమిని అసైన్డ్ చేసిన తర్వాత 9/77 చట్టం ప్రకారం వారి కుటుంబ వారసులకు మాత్రమే చెందాలని ఉందన్నారు. అలాంటిది రెవెన్యూ అధికారులు తప్పుదారి పట్టించి తప్పుడు రికార్డులు అందించి దళితులను మోసం చేశారని విమర్శించారు. వెంటనే దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజా, దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రామచంద్ర, సంగప్ప, కిష్టప్ప, వెంకటేశులు, రమేష్, పెద్దన్న, మహిళలు పాల్గొన్నారు.

పామిడిని అభివృద్ధి చేసి చూపిస్తా

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

ప్రజాశక్తి-పామిడి

పామిడి మండలాన్ని అభివృద్ధి చేసి చూపుతానని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ అన్నారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ పక్కన ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్‌ను మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పామిడి పట్టణం వస్త్రాలకు ప్రసిద్ధి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుందన్నారు. ఈనేపథ్యంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు పట్టణానికి దూరంగా నిరుపయోగంగా ఉన్న స్థలాన్ని అభివృద్ధి చేసి కూరగాయల మార్కెట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. అంతేగాకుండా తన కుమారుడు ఈశ్వర్‌కు ఇచ్చిన మాట లేరకు నియోజకవర్గ అభివృద్ధిని పామిడితోనే మొదలు పెట్టామన్నారు. అనంతరం వడ్డే వీధిలో నూతనంగా వేసిన సిసి రోడ్డును ప్రారంభించారు. తర్వాత భోగేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన శివపార్వతుల కళ్యాణోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి, తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఎంపిడిఒ తేజోష్ణ, హేమ్లానాయక్, పంచాయతీ సెక్రటరీ గోపాల్, దేవాదాయ శాఖ మండల ఇఒ కృష్ణయ్య, టిడిపి సీనియర్ నాయకులు ప్రభాకర్‌చౌదరి, బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, జింకల సంజీవకుమార్, బొమ్మా మోహన్, రాజేష్‌నాయక్, ఆనంద్‌బాబు, సుదర్శన్‌బాబు, ఎద్దులపల్లి వెంకటేష్, అనుంపల్లి శీన, మహేష్, పసుల శ్రీరాములు, కరూరు శివ, అప్పన్నగారి కుమార్, జనసేన ధనుంజయ, పూజారి లక్ష్మీదేవి, సోషల్ మీడియా శివ, తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిశీలన

నార్పల : మండల పరిధిలోని పులసలనూతల గ్రామంలో ఏర్పడిన నీటి సమస్యను అధికారులతో కలిసి టిడిపి నాయకులు ఆకుల విజయకుమార్ (బాబు) సోమవారం పరిశీలించారు. గ్రామంలో నీటి సమస్య ఎక్కువగా ఉందని గ్రామస్తులు బాబుకు తెలియజేయడంతో స్పందించి సంబంధిత అధికారులతో కలిసి గ్రామానికి చేరుకుని పంచాయతీ బోర్లు, నీటి ట్యాంకు, పైప్‌లైన్లను, పరిశీలించారు. త్వరలోనే నీటి సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ జనార్దన్, ఇఒఆర్‌డి శైలజారాణి, పంచాయతీ కార్యదర్శి శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యల వెల్లువ

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని సీతారామాంజనేయ స్వామి కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సమస్యలపై వినతిపత్రాలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా ముఖ్యంగా నియోజకవర్గంలోని నేమకల్లు పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీల అమలుపై కలెక్టర్ వినోద్‌కుమార్‌తో విప్ కాలవ శ్రీనివాసులు చర్చించారు. ఇందులో ఉంతకల్లు రిజర్వాయర్ నిర్మాణం, ఆవులదట్ల బ్రాంచి కాలువ, హెచ్ఎల్సీ ఆధునీకరణ, జీడిపల్లి నుండి బిటిపికి క్రిష్ణా జలాల తరలింపు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఆయా హామీల అమలుపై త్వరలో జిల్లాకేంద్రంలో ప్రాజెక్ట్ చీఫ్ ఇంజినీర్ సమక్షంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించటానికి కలెక్టర్ అంగీకరించినట్లు కాలవ శ్రీనివాసులు తెలిపారు. అలాగే ఉక్కు పరిశ్రమలు అధికంగా ఉన్న నియోజకవర్గంలో ఉక్కు పరిశ్రమ కారిడార్ ఏర్పాటుకు ప్రతిపాదనలు త్వరగా రూపొందించాలని కోరామన్నారు. రాయదుర్గం ప్రాంతంలో ఎక్కువ మంది గార్మెంట్స్ రంగంపై ఆధారపడి జీవిస్తున్నందున పారిశ్రామిక వేత్తలతో మాట్లాడి పెద్ద పరిశ్రమ వచ్చేలా చూడాలని అడిగామన్నారు. మహిళలకు అవసరమైన కుట్టు మిషన్లు అందచేయాలని విన్నవించామన్నారు. మరి ముఖ్యంగా రాయదుర్గం పట్టణ పరిధిలో డంపింగ్ యార్డ్ కు స్థల పరిశీలన జరిగిందని త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరామన్నారు. వేసవిలో

సిఎం హామీలపై కలెక్టర్‌తో విప్ 'కాలవ' చర్చ

ఎదురైయ్యే తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.20లక్షల నిధులు మంజూరు చేయాలని, తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి అమత్ 2 కింద పంపిన ప్రతిపాదనలను ఆమోదించాలని విజ్ఞప్తి చేశానన్నారు.

నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న ఆర్‌ఓ ప్లాంట్లకు మరమ్మతులు చేయించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ కోరారు. ఈమేరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు కలిసి వినతిపత్రం ఇచ్చారు.

ఇకపోతే ఎపిఐఐసి భూముల్లో పరిశ్రమలు వేగవంతంగా ఏర్పాటు చేయాలని స్టీల్ ప్లాంట్, పరిశ్రమల సాధన కమిటీ కన్వీనర్ బిఎం నాదల్ విన్నవించారు. వివిధ పరిశ్రమలకు కేటాయించిన 700 ఎకరాల భూములను తిరిగి ప్రభుత్వానికి తిరిగి ఇచ్చే విధంగా చర్యలు



వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం నాయకులు



కలెక్టర్‌తో మాట్లాడుతున్న విప్ కాలవ శ్రీనివాసులు

వేగవంతంగా చేయాలని కోరారు.

అలాగే రాయదుర్గంలో ముస్లిం సామాజిక వర్గానికి శ్మశాన వాటిక కోసం స్థలం కేటాయించాలని ముస్లిం రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ మజీద్, అబ్దుల్‌వహాబ్, ఖాజీ మొహమ్మద్ సైపుల్లా, వలి, ఎంఐఎం ప్రతినిధి శర్మాస్, అబూబక్కర్ తదితరులు పాల్గొన్నారు.

1998 డిఎస్సీ ద్వారా అర్హత పొంది ఎంటిఎస్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న తమ డిమాండ్లను నెరవేర్చాలని కలెక్టర్ వినోద్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు.

జాతీయ ఉపాధి హామీ పథకం నిధుల మళ్లింపుపై చర్యలు తీసుకోవాలని వైసిపి పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నుపూస రవీంద్రారెడ్డి కోరారు. ఈమేరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో సర్పంచులు, ఎంపిటిసిలు, ఎంపిపిలతో కలిసి కలెక్టర్ వినోద్‌కుమార్ వినతిపత్రం అందజేశారు.



డి.హీరేహాళ్ మండలంలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-డి.హీరేహాళ్

మండలంలోని పలుగ్రామాల్లో పోలీసులు పర్యటించి సోమవారం సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సైబర్ బాధితులు ఎవరైనా ఉంటే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ప్రతి గ్రామంలోని పురవీధుల్లో తిరుగుతూ మైకు ద్వారా సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

పెద్దవప్పూరు : మండలం పరిధిలోని ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ నాగేంద్రప్రసాద్ సూచించారు. సోమవారం మండలం పరిధిలోని షేక్‌పల్లి, నామనాంకుపల్లి, ముచ్చుకోట తదితర గ్రామాల్లో సైబర్ నేరాలపై ఆటో ద్వారా మైకు ఏర్పాటు చేసి ఎల్ఇడి స్క్రీన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కొంతమంది ఈజీ మనీకి అలవాటు పడి సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. కావున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండా మీ డబ్బును కాపాడుకోవాలని కోరారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

రాయదుర్గం : ప్రభుత్వ ఆదేశాల మేరకు రాయదుర్గం పురపాలక సంఘం పరిధిలో ఈనెల 18 నుంచి 21వతేదీ వరకూ నేతాజీ రోడ్డు 5వ సచివాలయంలో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 24 నుంచి 28వతేదీ వరకూ 6వ సచివాలయం వద్ద ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రం పని చేస్తుందన్నారు.

పుట్లూరు : నేటి నుండి ఈనెల 28వతేదీ వరకూ మండలంలో ఆధార్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ అలివేలమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18, 19న కడవకల్లు, మడ్డిపల్లి, బాలాపురం, 20, 21న చెర్లోపల్లి, కుమ్మనమల, బాలాపురం, 24, 25న అరకటివేముల, ఎల్లుట్ల, పుట్లూరు, 27, 28న కందికాపుల, మడుగుపల్లి, ఎస్.గూడూరు సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

పామిడి : ఈనెల 18 నుంచి 28వతేదీ వరకూ మండలంలోని ఎద్దులపల్లి సచివాలయంలో ఆధార్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ తేజోష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రీసర్వే రైతులకు వరం : జెసి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

గ్రామాల్లో ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే రైతులకు వరం లాంటిది అని జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ అన్నారు. సోమవారం మండల పరిధిలోని గుండిగానిపల్లి గ్రామంలో రీసర్వే పనులను జెసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులు రీసర్వేను అన్వయించుకుంటే సత్ఫలితాలను ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుమతి, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనాథ్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ నాగిరెడ్డి, ఇన్‌ఛార్జి విఆర్‌ఒ నాగరాజు, మండల సర్వేయర్ సుకర్ణ, ఐకెపి సర్వేయర్ సుంకన్న, రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి కొరుగొండ, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ నీలస్వామి, మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ నాగిరెడ్డి, ఐ టిడిపి ఛాపియన్ బొజ్జన్న, మాజీ డీలర్ శివన్న, కార్యదర్శి నరసింహ, తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ

రస్తా సమస్య పరిష్కరించాలని ధర్నా

గుత్తి : పట్టణంలోని పాత సిపిఐ కాలనీలో ఉన్న జండా కట్టకు వెళ్లే రస్తాకు అడ్డంగా నిర్మించిన గోడను తొలగించాలని కాలనీవాసులు సోమవారం మున్సిపల్, తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. ముందుగా పోలీస్‌స్టేషన్‌లో ఆక్రమణలపై ఫిర్యాదు చేశారు. అక్కడ నుంచి మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ 46 ఏళ్ల క్రితం సర్వే నంబర్ 624లో 8.69 సెంట్ల గ్రామకంఠం స్థలంలో దస్తగిరి జండా కట్ట (దర్గా)ను నిర్మించుకుని ప్రార్థనలు నిర్వహించుకునే వారమన్నారు. ప్రతి ఏటా అక్కడ గ్యార్వీ పండుగ జరుపుకుంటామన్నారు. అదేకాలనీకి చెందిన హైమావతి, కళ్యాణి, భాగ్యమ్మ, అనీష్, అనిల్ దర్గా స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని చెప్పారు. నిర్మాణాలను తొలగించి రస్తా సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియా, తహశీల్దార్ డి.ఓబిలేసుకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు ఎస్.దాదాఖలందర్, డి.రహంతుల్లా, ఎస్.మహబూబ్ బాషా, డి.మాబు, టైలర్ షాషావలి, ఇమామ్ హుస్సేన్, బాషా, నజీర్ పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్టాపన

బెలుగుప్ప : మండల కేంద్రంలోని మంజునాథ స్వామి ఆలయంలో మలయాళ పండితులు బ్రహ్మశ్రీ శ్రీరంగం శరన్నోహన్ తంత్రి ఆధ్వర్యంలో సోమవారం ధ్వజస్తంభ ప్రతిష్టాపన వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం మహాగణపతి, మృత్యుంజయ, మహా సుదర్శన హోమాలు చేశారు. తర్వాత స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

క్రికెట్ విజేతలకు కమిషనర్ అభినందన

గుత్తి : క్రికెట్ పోటీల్లో విజేతలైన మున్సిపల్ అధికారులు, సిబ్బందిని మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియా సోమవారం అభినందించారు. హ్యాపీ సండే కార్యక్రమంలో భాగంగా ఆదివారం తాడిపత్రి పట్టణంలోని క్రీడా మైదానంలో గుత్తి మున్సిపాలిటీ గ్లాడియేటర్స్ జట్టు, తాడిపత్రి మున్సిపాలిటీ థండర్స్ జట్టు మధ్య క్రికెట్ మ్యాచ్ జరిగింది. ఆ పోటీలో తాడిపత్రి జట్టుపై గుత్తి జట్టు గెలుపొందింది. దీంతో గుత్తి మున్సిపల్ కార్యాలయంలో సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాంబాబు, ఆర్‌ఓ సంతోష్ కుమార్, రవి కిరణ్, నాగార్జున, సతీష్ కుమార్, హరికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు బైండోవర్

యల్లనూరు : మండల పరిధిలోని బొప్పేపల్లి గ్రామానికి చెందిన ఇద్దరిపై పోలీసులు సోమవారం బైండోవర్ కేసు నమోదు చేశారు. భూమి వివాద సమస్యతో ఇద్దరు రైతులు గొడవ పడుతున్న నేపథ్యంలో మండల మేజిస్ట్రేట్ రాజా ముందు హాజరు పరచి బైండోవర్ కేసు నమోదు చేసినట్లు సిఐ సత్యబాబు తెలిపారు.

మాలల యుద్ధ గర్జనకు తరలిరండి

గుత్తి : రాయలసీమ మాలల యుద్ధ గర్జన కార్యక్రమానికి తరలిరావాలని మాల మహాసభ జిల్లా అధ్యక్షుడు జి.నాగప్ప పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని పత్తికొండ రోడ్డు కూడలిలో ఉన్న బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం యుద్ధ గర్జనకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహాసభ నాయకులు ఎం.రామాంజనేయులు, బేల్దారి చంద్ర, రమేష్, శ్రీనివాసులు, ఓబులేసు, చిరంజీవి, న్యాయవాది సాలప్ప, తదితరులు పాల్గొన్నారు.

అసలైన లబ్ధిదారులకు న్యాయం చేయాలి

ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కక్కలపల్లి కాలనీ సర్వే నెంబర్ 247-2ఎ, 2బిలో ఉన్న ఇంటి స్థలాలకు సంబంధించి నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు కొడవండ్ల నరేష్, ఏఐకేఎం ఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కిష్ట, ఎరుకల ప్రజా పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సాకే గోవిందు, ప్రజాబలం చంద్రునాయక్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కక్కలపల్లి కాలనీ సర్వే నెంబర్ 247-2, 2బిలో 2011 సంవత్సరంలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన 94 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారని తెలిపారు. అయితే అక్కడ మౌలిక వసతులు సరిగా లేనందున సర్వే నెంబర్‌లోకి వెళ్లడానికి సమయం పట్టిందన్నారు. అక్కడ కొంత మంది కబ్జాదారులు చొరబడి కాలనీని వేయించిన నాగరాజుతో కుమ్మక్కై ఇష్టారాజ్యంగా దొంగ పట్టాలు 2017-2022లో పట్టాలు పుట్టించి విక్రయించారని ఆరోపించారు. ఇప్పుడు అధికారులు నోటీసులు ఇచ్చినా అక్రమ కబ్జాదారులు పట్టించుకోవడం లేదన్నారు. అసలైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని అనేక మార్లు కలెక్టర్ కార్యాలయం, ఆర్‌డిఓ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నామని తెలిపారు. అయినా అక్రమ కబ్జాదారులు బెదిరిస్తున్నారని తెలిపారు. రాత్రి సమయాల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. ఎన్నిసార్లు పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోక పోవడంతో కబ్జాదారులు పెట్రేగిపోతున్నారని తెలిపారు. కోర్టులను సైతం ఆశ్రయించారు. ఏపార్టీ అధికారంలో ఉంటే వారిపేరు చెప్పుకొని కబ్జాదారులు అసలైన లబ్ధిదారులను బెదిరిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి అసలైన లబ్ధిదారులకు న్యాయం చేయాలన్నారు. కబ్జాదారుల నుంచి లబ్ధిదారులకు ప్రాణ రక్షణ కల్పించాలని కోరారు.



విలేకరులతో మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

వైసిపి నాయకుని మృతికి నివాళి

ప్రజాశక్తి-రాప్తాడు

అనారోగ్యంతో మృతిచెందిన మండలంలోని వరిమడుగు గ్రామానికి చెందిన వైసిపి నాయకులు చవ్వల రవికిరణ్ మృతికి వైసిపి నాయకులు సోమవారం నివాళు లర్పించారు. ఇందులో భాగంగా రవికిరణ్ మృతదేహానికి పూలమాలలు వేసి అంజళి ఘటించారు. నివాళులర్పించిన వారిలో వైసిపి మండల కన్వీనర్ సాకే వెంకటేష్, యూత్ కన్వీనర్ విశ్వనాథ్‌రెడ్డి, మాచిరెడ్డి చెన్నారెడ్డి, తిరుపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మృతుడి కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న వైసిపి నాయకులు